సాక్షి
మెదక్

శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



ఆర్టీసీ పండుగ చేసుకుంది

బతుకమ్మ, దసరా పండుగలు ఆర్టీసీకి కలిసొచ్చింది. పెద్ద ఎత్తున ప్రయాణికులను చేరవేసి అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంది.

వివరాలు 8లో ▸



కుమారుడి కళ్లెదుటే తల్లి మృతి

గుర్తు తెలియని వాహనం స్కూటీని ఢీకొట్టడంతో తల్లి మృతిచెందగా, కుమారుడికి తీవ్ర గాయాలు అయ్యాయి.

వివరాలు 8లో ▸



చట్టాలపై అవగాహన అవసరం

చట్టాలపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ సూచించారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

దుర్గమ్మకు పల్లకీ సేవ



పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వనదుర్గమ్మకు గురువారం పల్లకీ సేవ నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకొని సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి పల్లకీపై ఊరేగించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, ఆలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

20న ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టు ఎంపిక

నర్సాపూర్: ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో జూనియర్ జట్టును ఈనెల 20వ తేదీన ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఖోఖో అడహక్ కన్వీనర్ మహేందర్‌రావు, సభ్యులు పోచప్ప, నాగరాజు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. నర్సాపూర్‌లోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో క్రీడాకారుల ఎంపిక ఉంటుందన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి 30 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే 43వ జూనియర్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులను ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులు 18 ఏళ్ల లోపు ఉండాలని, మరిన్ని వివరాలకు 9866546563, 9440699225 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

21న రాయిలాపూర్‌కు ట్రైనీ కలెక్టర్లు

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 21వ తేదీన మండలంలోని రాయిలాపూర్‌కు ట్రైనీ కలెక్టర్లు వస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామంలో ఉండి అన్ని ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు, ఇతర పరిపాలన అంశాలను పరిశీలిస్తారని చెప్పారు. అలాగే గ్రామస్తులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహిస్తారని వివరించారు. ఎంపీఓ కలీముల్లా, పంచాయతీ కార్యదర్శి సలీం గ్రామస్తులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు.

హైకోర్టు జడ్జి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



ఆలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ రమాదేవి

పాపన్నపేట(మెదక్): ఈనెల 19వ తేదీన ఏడుపాయలలో హైకోర్టు జడ్జి పర్యటన ఉందని, పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి అధికారులకు సూచించారు. గురువారం ఏడుపాయలను సందర్శించిన ఆమె అధికారులతో చర్చించారు. హైకోర్టు జడ్జి జస్టిస్ విజయ్‌సేన్ ఏడుపాయల దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారని చెప్పారు. ఈసందర్భంగా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులు, ఆలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆమె వెంట మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, ఎస్సై శ్రీనివాస్ గౌడ్, ఆర్‌ఐ నాగరాజు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకరి కృష్ణ, సామ్య నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు గురువారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మొదటిసారి కలెక్టర్‌ను కలిసినట్లు తెలిపారు. ఈసందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్ల నియామకం, వేసవి సెలవుల్లో ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవుల గురించి తెలియజేశామన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు సంతోష్ కుమార్, మల్లారెడ్డి, నవీన్, శ్రీనివాస్‌రెడ్డి, దుర్గయ్య పాల్గొన్నారు.

వెంటాడుతున్న వాన

ఆందోళనలో రైతన్న
- తడిసి ముద్దవుతున్న ధాన్యం
- వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయం

అన్నదాతను వర్షాలు వెంటాడుతున్నాయి. మొలకనాడు ఎండ.. కోతనాడు వానతో ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో ముమ్మరంగా వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దవుతోంది. చేసేది లేక క్వింటాల్‌కు రూ. 2 వేల చొప్పున విక్రయిస్తూ నష్టాలు చవిచూస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు తడిసిన ధాన్యాన్ని మూడు కిలోలు ఎక్కువ తూకం వేస్తున్నట్లు తెలిసింది.

మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా వరి కోతలు ప్రారంభమయ్యాయి. అయితే జిల్లాలో వారం రోజులుగా నిత్యం ఏదో ఒక ప్రాంతంలో వర్షం కురుస్తూనే ఉంది. మెదక్, చిన్నశంకరంపేట, హవేళిఘనాపూర్, కొల్చారం, చేగుంట, నార్సింగి, రామాయంపేట, నిజాంపేట తదితర మండలాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. వరి పొలాల్లో నుంచి భారీగా వరద పారుతుండడంతో వరి పంట కోయడానికి అడ్డంకిగా మారింది.

క్వింటాల్‌పై రూ. 390 నష్టం

వర్షాలకు అన్నదాతలు చేసేదిలేక ఆరబెట్టకుండానే క్వింటాల్ ధాన్యాన్ని రూ. 2 వేలకు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా వారు క్వింటాల్‌పై మూడు కిలోలు అదనంగా తూకం వేస్తున్నారు. దొడ్డు రకానికి క్వింటాల్‌కు రూ. 2,320 చెల్లిస్తుండగా, రైతులు రూ. 320 నష్టపోతున్నారు. దీంతో పాటు అదనంగా మూడు కిలోల



చిన్నశంకరంపేట: గవ్వలపల్లిలో వర్షానికి తడిసిన ధాన్యం

ధాన్యం వ్యాపారులు తీసుకుంటున్నారు. ఈ విలువ రూ.70 కాగా మొత్తంగా క్వింటాల్‌పై రూ. 390 నష్టపోతున్నారు. వరి కోతల సమయంలో వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం ఆరబెట్టలేక పోతున్నామని, దిక్కుతోచని స్థితిలో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిల్లర్లకు కలిసి వస్తున్న కాలం

వర్షాలు మిల్లర్లకు వరంగా మారాయి. జిల్లాలో 2023- 24 యాసంగి సీజన్‌కు సంబంధించి ప్రభుత్వానికి 70 వేల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్, వానాకాలంలో 1,300 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తంగా 71,300 మెట్రిక్ టన్నులు మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది. బకాయిలున్న బియ్యాన్ని చెల్లించకపోవడంతో ఇప్పటికే సివిల్ సప్లై అధికారులు వారిపై క్రిమినల్ కేసులు సైతం నమోదు చేశారు. దీంతో బకాయి పడిన బియ్యం ప్రభుత్వానికి అప్పగించాలనే ఉద్దేశంతో ఉన్నారు. మరోవైపు రైతులు ధాన్యం ఆరబెట్టేందుకు వీలులేకపోవడంతో ఇదే అదనుగా భావించి మిల్లర్లు తక్కువ ధరకు కొంటున్నారు. తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులో మరాడిస్తే నాణ్యతతో కూడిన బియ్యం వస్తోంది. దీంతో వర్షాలు మిల్లర్లకు కలిసి వస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

కోత మిషన్‌కు రూ.900 అదనం

సాధారణంగా వరి కోసే యంత్రానికి గంటకు రూ. 2,100 చెల్లించాల్సి ఉండగా, వర్షాల కారణంగా యంత్రం పొలాల్లో దిగబడుతోంది. దీంతో చైన్ మిషన్ ద్వారా వరి కోతలు కోస్తున్నారు. ఈ మిషన్‌కు గంటకు రూ. 3 వేలు చెల్లిస్తున్నారు. అంటే గంటకు రూ. 900 అదనం. ఇది ఎకరా వరి కోయడానికి రెండు గంటల సమయం పడుతోంది.



కళా ఉత్సవ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ముగిసిన కళా ఉత్సవ్

మెదక్ కలెక్టరేట్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీలు ముగిశాయి. గురువారం పాటలు, థియేటర్, కథా కథనం పోటీలు నిర్వహించారు. మొదటి స్థానం పొందిన కళాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. వాయిద్యాల పోటీల్లో ప్రథమ స్థానం అఖిల్ (న్యూ హై స్కూల్, మెదక్), కథా కథనం పోటీల్లో ప్రథమ స్థానం అర్పిత (చేగుంట), నృత్య పోటీలో ప్రథమ స్థానం ఐశ్వర్య గ్రూపు (రత్న టెక్నో స్కూల్ మెదక్), డ్రామా పోటీల్లో ప్రథమ స్థానం సింధు గ్రూపు (సిద్దార్థ మోడల్ స్కూల్ మెదక్), పాటల పోటీలో ప్రథమ స్థానం (జీవన్ టీజీటీడబ్ల్యూఆర్‌జేసీ, నర్సాపూర్), చిత్రలేఖనంలో ప్రథమ స్థానం రుచిత (మోడల్ స్కూల్ (చిన్నశంకరంపేట) సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాధికారి నీలకంఠం, జిల్లా పరీక్షల విభాగం అధికారి రామేశ్వరప్రసాద్, ఏఎస్‌ఓ నవీన్ కుమార్ ప్రశంసాపత్రాలు అందించారు.

దార్శనికుడు వాల్మీకి మహర్షి

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. రాముడి దివ్య చరిత్రను మానవాళికి అందించిన మహనీయుడని కొనియాడారు. రామాయణాన్ని రచించి, ఆదికవిగా పేరు ప్రఖ్యాతలు పొందిన వాల్మీకి సంస్కృత సాహిత్యంలో మొదటి పురాణ గాథను రచించారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్‌తో పాటు జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, పోలీస్ అధికారులు

పడకేసిన పంచాయతీ పాలన

- సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక విధులు గాలికి..
- కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- ఏదైనా ఘటనలు జరిగాక హడావుడి చేస్తున్న ఉన్నతాధికారులు
- సంజీవన్‌రావుపేట్ ఘటనే ఇందుకు నిదర్శనం



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో స్థానిక సంస్థల పాలన అస్తవ్యస్తంగా తయారైంది. ప్రధానంగా గ్రామ పంచాయతీలు తమ ప్రాథమిక విధులైన సురక్షిత తాగునీరు సరఫరా, పారిశుద్ధ్యం వంటి విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇటీవల జరిగిన నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట్‌లో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. అధికారులు సరఫరా చేసిన కలుషిత తాగునీరు తాగి గ్రామంలో ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడటం కలకలం సృష్టించింది. పదుల సంఖ్యలో గ్రామస్తులు వాంతులు, విరేచనాలతో ఆసుపత్రి పాలయ్యారు. గ్రామాల్లో తాగునీటి వసతి కల్పించడం గ్రామపంచాయతీల ప్రాథమిక విధి. కానీ ఇలాంటి ప్రాథమిక విధులను అధికారులు గాలికొదిలేస్తున్నారు. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. సరిపడా నిధులు అందుబాటులో లేకపోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రత్యేక అధికారులు గ్రామాలను గాలికొదిలేస్తున్నారు. జిల్లాలో మొత్తం 647 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

గ్రామ పంచాయతీల పాలనపై పర్యవేక్షణ కరువైంది. ఉన్నతాధికారులు ఈ గ్రామ పంచాయతీలను పట్టించుకోకపోవడంతో వాటి పాలన గాలికొదిలేసినట్లయింది. స్థానిక సంస్థల పాలనను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ అదనపు కలెక్టర్ పోస్టును నియమించింది. అయితే ఇలాంటి జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ పకడ్బందీగా లేకపోవడంతో గ్రామ పంచాయతీల పాలన అస్తవ్యస్తంగా తయారైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏదైనా ఘటన జరిగిన తర్వాత.. ఆయా గ్రామాలకు వెళ్లి హడావుడి చేస్తున్న ఉన్నతాధికారులు ఆ తర్వాత.. గ్రామాలను పట్టించుకోవడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు సంజీవన్‌రావు పేట్ ఘటనే నిదర్శనమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అమాయక గ్రామీణ ప్రజల ప్రాణాలు గాలిలో కలిశాయి. ఇకనైనా గ్రామ పంచాయతీల పాలనపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి అవసరమై ఎంతైనా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మారుమూల గ్రామాలు అలా.. అర్బనైజ్డ్ గ్రామాలు ఇలా..

జిల్లాలో మారుమూల గ్రామాల పరిస్థితి ఒక విధంగా ఉంటే., పట్టణాలు, నగరానికి సమీపంలో ఉన్న గ్రామా పంచాయతీల పరిస్థితి మరో విధంగా ఉంది. ప్రధానంగా హెచ్‌ఎండీఏ పరిధిలోని గ్రామ పంచాయతీలు అక్రమాలకు నిలయాలుగా మారాయి. పెద్ద ఎత్తున్న అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. నిబంధనలను గాలికొదిలేసి బహుళ అంతస్తులు నిర్మిస్తున్నప్పటికీ., గ్రామ పంచాయతీల క్షేత్ర స్థాయి సిబ్బంది ముడుపులు తీసుకుని చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో హెచ్‌ఎండీఏ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో అస్తవ్యస్త నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రధానంగా పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, జిన్నారం, గుమ్మడిదల, కంది, సంగారెడ్డి మండలాల పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు

మహనీయుల జీవితం ఆదర్శం

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: మహనీయుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకొని, వారి ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి, కొమురం భీం వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మహాకవి వాల్మీకి రామా యణాన్ని రచించి సమాజానికి అనేక విలువలు అందించారని కొనియాడారు. ఆదివాసీ ఆత్మగౌరవానికి కొమురం భీం ప్రతీక అన్నారు. తమ భూమిలో తమదే అధికారం అనే నినాదంతో ఉద్యమించి వీరమరణం పొందిన యోధుడని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయండి

మెదక్‌జోన్: పత్తి కొనుగోళ్లకు త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ మొదటి వారం నుంచి పత్తి కొనుగోలు కేంద్రాలకు వస్తుందన్నారు. జిల్లాలో 36,142 ఎకరాల్లో పత్తి సాగు జరిగిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్ల సజావుగా సాగేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈనెల 25వ తేదీ వరకు కొనుగోళ్ల ప్రారంభించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

1,500 కొత్త బస్సుల కొనుగోలు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- రుణమాఫీపై ఆందోళన వద్దు
- జహీరాబాద్‌లో ఎంపీ క్యాంపు కార్యాలయం ప్రారంభం



ఎంపీ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

జహీరాబాద్: ఆర్టీసీ ప్రయాణికుల సంక్షేమమే తమ ధ్యేయమని రోడ్డు, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం 1500 కొత్త బస్సులను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. గురువారం జహీరాబాద్‌లో ఎంపీ సురేష్‌షెట్కార్ నిర్మించిన ఎంపీ క్యాంపు కార్యాలయ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త బస్సుల కోసం ఇప్పటికే ఆర్డర్ కూడా ఇచ్చామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో విపరీతమైన రద్దీ పెరిగిందని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రుణమాఫీ కాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ చేసి తీరుతామని చెప్పారు. రూ.2 లక్షల కంటే ఎక్కువ ఉన్న రుణం ఉన్న వారు మిగిలిన రుణాన్ని చెల్లిస్తే, వారికి తేదీలను నిర్ణయించి రుణమాఫీ చేస్తామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధుల బకాయిలు చెల్లించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. అయితే.. గురుకుల పాఠశాలలు, కళాశాలలు మూసి ఆందోళనలు చేస్తే మాత్రం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలను నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, ఐడీసీ మాజీ చైర్మన్ ఎం.డి.తన్వీర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించండి

చేగుంట(తూప్రాన్): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. గురు వారం మండల పరిధిలోని చందాయిపేట తో పాటు పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. దళా రులను ఆశ్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. చేగుంట శివారులోని మక్కరాజీపేట రోడ్డు గుంతలమయం కావడంతో ఆర్‌అండ్‌బీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి వాహనదారుల ఇబ్బందిని తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మ పాల్గొన్నారు.

అశ్రునయనాలతో..

- ఉసిరికపల్లి మృతుల అంత్యక్రియలు
- మూడు తండాల్లో విషాదఛాయలు
- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు



తాళ్లపల్లి తండాలో దుర్గమ్మ, శివరాం మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

శివ్వంపేట(నర్సాపూర్)/తూప్రాన్: ఉసిరికపల్లి ఘటనలో మృతిచెందిన ఏడుగురి అంత్యక్రియలు గురువారం అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. మృతులు ధనావత్ దుర్గమ్మ, శివరాం దంపతుల అంత్యక్రియలు తాళ్లపల్లి తండాలో, వీరి పెద్ద కూతురు శాంతి, మనుమరాలు మమతవి భీమ్లా తండాలో, మరో కూతురు అనిత, మనుమరాళ్లు శ్రావణి, హిందు అంత్యక్రియలు జెగ్యా తండాలో నిర్వహించారు. ఒకే కుటుంబానికి చెందినా.. వివిధ ప్రాంతాల్లో అంత్యక్రియలు నిర్వహించడంతో బంధువులు అందరి అంతిమయాత్రలో పాల్గొనలేకపోయారు. ఎలాంటి గొడవలు జరగకుండా ఆయా తండాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ నామ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని జెగ్యా తండాలో అనిత కుటుంబ సభ్యులు, తండావాసులు ఆందోళన చేపట్టారు. ఈక్రమంలో నామ్‌సింగ్ కుమారుడు రాజేశ్ కనిపించడంతో దాడికి యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. భార్య, ఇద్దరు బిడ్డలను ఆ దేవుడు తీసుకెళ్లిండు.. ఇప్పుడు నాకు దిక్కెవరు అంటూ అనిత భర్త మోహన్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. ప్రమాదంలో మృతిచెందిన మమత (10వ తరగతి), హిందు (8వ తరగతి) గూడూర్‌లోని కేజీబీవీలో చదువుతున్నారు. వీరి మృతి పట్ల హాస్టల్ విద్యార్థినులు, అధ్యాపకులు గురువారం శ్రద్ధాంజలి ఘటించారు. ఇద్దరూ చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచేవారని తెలిపారు. దసరా సెలవుల్లో ఇంటికి వెళ్లిన స్నేహితులు కానరాని లోకాలకు వెళ్లిపోవడంపై కన్నీటి పర్యంతం అయ్యారు.

తూప్రాన్ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

మృతదేహాలకు తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం వాహనాల్లో మృతదేహాలను గ్రామాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా.. మృతురాలు అనిత భర్త మోహన్ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. మృతికి కారకుడైన కారు డ్రైవర్ నామ్‌సింగ్ వచ్చే వరకు మృతదేహాలను తరలించవద్దని వాహనాలకు అడ్డుపడ్డారు. దీంతో ఆస్పత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. మూడు తండాలకు వేర్వేరు వాహనాల్లో మృతదేహాలను తరలించారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మృతుల కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



తూప్రాన్: ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న వారిని సముదాయిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

ప్రభాకర్ శర్మకు నివాళులు



ప్రభాకర్‌శర్మ పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ త్రిగుళ్ల ప్రభాకర్‌శర్మ హృద్రోహ సంబంధ వ్యాధితో బుధవారం రాత్రి దివంగతులయ్యారు. రాత్రి స్వగ్రామానికి పార్థీవదేహాన్ని తీసుకురాగా గురువారం ప్రముఖులు నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ వైస్ మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, మాజీ సర్పంచ్‌లు భానుప్రకాశ్ రావు, ఎల్లయ్య, మాజీ ఎంపీటీసీ మంజుల మహేందర్‌రెడ్డి, వివిధ పార్టీల రాష్ట్ర నేతలు దయానంద్‌రెడ్డి, రాంరెడ్డి ప్రభాకర్‌శర్మ మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నలుభై ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో ఎంత మంది విద్యార్థులకు భవిష్యత్ మార్గదర్శకుడిగా నిలిచారు ప్రభాకర్‌శర్మ.

టెలీమానస్‌తో ఒత్తిళ్లకు చెక్



అవగాహన కల్పిస్తున్న జ్ఞానేశ్వర్

తూప్రాన్: మానసిక రుగ్మతతో బాధపడుతున్న వారికి నాణ్యమైన వైద్యం అందించి ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జ్ఞానేశ్వర్ అన్నారు. గురువారం ప్రపంచ పాలియేటివ్ కేర్ దినోత్సవం సందర్భంగా డివిజన్ పరిధిలోని నార్సింగి, వెల్దుర్తి, చేగుంట, మనోహరాబాద్ మండలాల్లోని పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో మానసిక ఒత్తిడికి గురై చనిపోతున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి సూచనలు, సలహాలు చేస్తే ఆరోగ్యవంతులుగా మారుతారని తెలిపారు. ఆరోగ్యవంతులుగా జీవించడానికి నిత్యం యోగాసనాలు వేసి ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఇందుకోసం 'టెలీమానస్ 14416' నంబర్‌కు ఫోన్ చేసి నిపుణుల సలహాలు, సూచనలు తీసుకొని ఒత్తిళ్లకు చెక్ పెట్టొచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బాల నర్సయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓవర్ లోడ్‌తో రోడ్లు ధ్వంసం

మట్టి టిప్పర్‌ను సీజ్ చేసిన డీటీఓ



టిప్పర్‌ను పరిశీలిస్తున్న డీటీఓ కొండల్‌రావు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) బైరోని చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న ఓవర్ లోడు టిప్పర్‌ను జిల్లా రవాణ శాఖ అధికారి (డీటీఓ) కొండల్‌రావు సీజ్ చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు గురువారం పోతారం వెళ్లిన డీటీఓకు ఓవరు లోడ్‌తో ఉన్న మట్టి టిప్పర్ కనిపించింది. సిబ్బంది సహాయంతో హుస్నాబాద్ నాగారం రోడ్డులోని వే బ్రిడ్జికి తరలించి తూకం వేయించగా 12 టన్నులు అధిక లోడుతో ఉన్నట్లు తేలింది. దీని వల్ల పోతారం(ఎస్), నాగారం గ్రామాల మధ్య తారు రోడ్డు ధ్వంసమైందని, హుస్నకొండ రూట్‌లో వెళ్లే వాహనదారులకు ఇబ్బంది కలిగి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు మట్టి టిప్పర్‌ను సీజ్ చేశామని, అనుమతులను పరిశీలించి జరిమానా విధిస్తామని డీటీఓ తెలిపారు.

బతుకమ్మ, దసరా పండుగలు ఆర్టీసీకి కలిసొచ్చింది. పెద్ద ఎత్తున ప్రయాణికులను చేరవేసి అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మెదక్ రీజియన్ పరిధిలోని అన్ని డిపోల్లో ఆర్టీసీ అధికారులు స్పెషల్ బస్సులను నడిపారు. అక్టోబర్ 2 నుంచి పాఠశాలలకు, 4 నుంచి కాలేజీలకు సెలవులు రావడంతో జనంపెద్ద ఎత్తున ఆర్టీసీ సేవలను వినియోగించుకున్నారు. అదే స్థాయిలో ప్రయాణికులను గమ్యానికి చేరుస్తూ డిపోలను సైతం ఆదాయ మార్గంలో నడిపేందుకు కార్మికులు శ్రమించారు. -నారాయణఖేడ్:



స్పెషల్ బస్సులో వెళ్తున్న ప్రయాణికులు

ఆర్టీసీ పండుగ చేసుకుంది

12 రోజుల్లో రూ.14.72 కోట్ల ఆదాయం

- కలిసొచ్చిన దసరా, బతుకమ్మ పండుగలు
- రద్దీకి అనుగుణంగా బస్సుల నిర్వహణ
- ఉమ్మడి జిల్లా పరిధిలో 8 డిపోలు
- 542 స్పెషల్ సర్వీసులను నడిపిన యాజమాన్యం

ఉమ్మడి జిల్లా పరిధిలోని 8 డిపోల నుంచి 5 నుంచి 16వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు తిరగడంతో 12 రోజుల్లోనే రూ.14.72 కోట్ల ఆదాయం సమకూరింది. కార్మికుల సంఖ్య తక్కువ ఉన్నా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడపడంలో యాజమాన్యం వెనుకడుగు వేయలేదు. అన్ని డిపోల నుంచి 542 స్పెషల్ సర్వీసులను ఆయా డిపోల పరిధినుంచి హైదరాబాద్‌తోపాటు ముఖ్య పట్టణాలకు, ప్రయాణికుల రద్దీ ఉన్న ప్రాంతాలకు ఆర్టీసీ నడిపింది. ప్రతీ డిపోలో డీఎంలు బస్సు సర్వీసుల నిర్వహణను ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఆయా డిపోల వారీగా ప్రయాణికుల రద్దీని ఎప్పటికప్పుడూ అంచనా వేస్తూ బస్సు సర్వీసులను నడిపించారు. పాఠశాలలు, కళాశాలలకు రెండు రోజుల తేడాతో సెలవులు ఇచ్చారు. దీంతో ఆర్టీసీ అధికారులు ఒక రోజు ముందుగానే 11వ తేదీవరకు స్పెషల్ బస్సులు నడిపించారు. దసరా అనంతరం 13 నుంచి ప్రత్యేక సర్వీసులు కొనసాగుతూనే వచ్చాయి.

ప్రయాణికుల కోసం కార్మికుల 'శ్రమ'

ఇటు ప్రయాణికులకు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తూ మరో పక్క సంస్థ మనుగడకు పాటుపడుతున్న కార్మికులు స్పెషల్ బస్సులు నడిచిన రోజులు అధిక శ్రమను వెచ్చించారు. మెజార్టీ డిపోల్లో నిర్దేశించిన స్పెషల్ బస్సుల నిర్వహణ మేరకు కార్మికులు లేరు. దీంతో బస్సు సర్వీసులు రద్దు కాకుండా, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు డబుల్ డ్యూటీలు చేశారు. ఆఫ్, స్పెషల్ ఆఫ్‌లను రద్దు చేసి విధుల్లోకి పిలిపించారు. మెజార్టీ కార్మికులు డ్యూటీ ముగించుకొని వచ్చాక తిరిగి డబుల్ డ్యూటీకి వెళ్లారు. ఇలా కార్మికుడికి 4 గంటలపాటు రెస్ట్ ఇచ్చి డబుల్ డ్యూటీలకు పంపించారు. డిపోల్లోనే కార్మికులకు రెస్ట్, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. డబుల్ డ్యూటీలు నిర్వహించిన డ్రైవర్‌కు డ్యూటీ దిగగానే రూ.1,000, కండక్టర్‌కు రూ.650ల చొప్పున డీడీ (డబుల్ డ్యూటీ) అమౌంట్ చెల్లించారు. సర్వీసుకు సరా సరి రావాల్సిన ఆదాయం కంటే అధిక ఆదాయం తెచ్చి న సర్వీసు కండక్టర్, డ్రైవర్లకు ఇన్‌సెంటీవ్‌ను సైతం డ్యూటీ దిగగానే స్పాట్‌లో చెల్లించారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణాన్ని సైతం స్పెషల్ బస్సుల్లో అనుమతించారు.

డిపోల వారీగా ఆదాయం (రూ.లక్షల్లో)

డిపో	5 నుంచి 11 వరకు
మెదక్	135.31
నారాయణఖేడ్	78.12
నర్సాపూర్	27.09
సంగారెడ్డి	119.99
జహీరాబాద్	127.33
సిద్దిపేట	154.92
గజ్వేల్- ప్రజ్ఞాపూర్	120.34
దుబ్బాక	61.85

14 నుంచి 16వ తేదీ వరకు ఆదాయం (రూ.లక్షల్లో)

డిపో	14వ తేదీ	15వ తేదీ	16వ తేదీ
మెదక్	29.21	29.30	25.55
నారాయణఖేడ్	15.95	17.09	16.50
నర్సాపూర్	7.39	5.22	4.35
సంగారెడ్డి	27.22	24.71	20.88
జహీరాబాద్	31.92	29.67	24.83
సిద్దిపేట	33.96	27.91	29.27
గజ్వేల్- ప్రజ్ఞాపూర్	26.99	22.08	20.62
దుబ్బాక	11.70	10.46	10.27

ఆర్టీసీలోనే ప్రయాణించాలి



ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ఎల్లప్పుడూ సంసిద్ధంగానే ఉంటుంది. దసరా సందర్భంగా ప్రత్యేక బస్సులు నడిపి ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూశాం. నిత్యం ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి సంస్థ మనుగడకు సహకరించాలి. పండుగలకు భారీ ఎత్తున ఆదాయం రావడం సంతోషకరం.

– మల్లేశయ్య, డీఎం, నారాయణఖేడ్

సమష్టి కృషితోనే..



మెదక్ రీజియన్ పరిధిలో అన్ని డిపోల డీఎంలు, కార్యాలయ సిబ్బంది, కార్మికుల సమష్టి కృషి కారణంగా స్పెషల్ బస్సులు సక్సెస్ అయ్యాయి. రీజియన్ పరిధిలో ఇప్పటివరకు రూ.14.72 కోట్ల ఆదాయం సమకూరింది. కార్మికులు కూడా డబుల్ డ్యూటీలు చేసి సర్వీసులు రద్దు కాకుండా చూశారు. ప్రజలు కూడా సహకరించారు.

– ప్రభులత, రీజినల్ మేనేజర్ (ఆర్ఎం), సంగారెడ్డి

ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని

వ్యక్తి ఆత్మహత్య



అంజయ్య(ఫైల్)

దుబ్బాకరూరల్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అక్బర్‌పేటభూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ హరీశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెల్పుల అంజయ్య(51) కుటుంబ పోషణ గడవకపోవడంతో గొడవలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. నిత్యం భార్యకు చెబుతూ బాధపడుతుండేవాడు. పక్కన ఉన్న పోతారెడ్డిపేట గ్రామంలో ఓ రైతు వ్యవసాయ పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. గురువారం ఉదయం పొలం దగ్గరు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టు పక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య గంగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా వృద్ధుడు..

తూప్రాన్: అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణ కేంద్రంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీప కాలనీలో నివాసం ఉంటున్న ఉడుత నాగయ్య(75), భార్య లక్ష్మి పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు. బుధవారం రాత్రి ఇద్దరూ ఇంట్లో నిద్రించగా అర్ధరాత్రి లక్ష్మికి మెలకువ వచ్చి లేవగా భర్త కనిపించలేదు. తలుపులు తీయకుండా బయట నుంచి గడియ పెట్టి ఉంది. పక్కింటివారి సాయంతో తలుపులు తెరిచి చూసేసరికి భర్త ఉరివేసుకొని కనిపించాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.



నాగయ్య మృతదేహం

కుమారుడి కళ్లెదుటే తల్లి మృతి

- స్కూటీని ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం
- గౌరారం సమీపంలో ఘటన



వనిత(ఫైల్)



విలపిస్తున్న దేవేందర్

వర్గల్(గజ్వేల్): గుర్తు తెలియని వాహనం స్కూటీని ఢీకొట్టడంతో తల్లి మృతి చెందగా, కుమారుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం వర్గల్ మండలం గౌరారం సమీప రాజీవ్‌రహదారిపై చోటు చేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, మృతురాలి కుమారుడు దేవేందర్ కథనం మేరకు.. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూరం గ్రామానికి చెందిన గోపన్నగారి బాలేశ్, వనిత(46) దంపతులకు దేవేందర్(29), చాణక్య ఇద్దరు కుమారులున్నారు. దేవేందర్‌కు వివాహమైంది. భార్య రమ్య, ఇద్దరు పిల్లలున్నారు. చాలా ఏళ్ల కిందట వీరందూ హైదరాబాద్‌కు వలసవెళ్లి దోమలగూడలో ఉంటున్నారు. బాలేశ్ ఏటీఎం సెక్యూరిటీగార్డుగా, చాణక్య క్యాబ్‌డ్రైవర్‌గా, దేవేందర్ పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తూ గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. దసరా పండుగ కోసం నామాపురం వచ్చారు. గురువారం దుబ్బాక మండలం అచ్చుమాయపల్లిలో అత్తగారింటి నుంచి హోండా యాక్టీవా స్కూటీపై హైదరాబాద్‌కు బయల్దేరారు. దేవేందర్ మార్గమధ్యలో పెద్ద చీకోడు వద్ద ఉన్న తల్లి వనిత(46)ను కలిశాడు. ఇద్దరూ కలిసి హైదరాబాద్ బయల్దేరారు. వర్గల్ మండలం గౌరారం సమీపంలోకి రాగానే రాజీవ్ రహదారిపై వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వనిత అక్కడికక్కడే మృతి చెందగా దేవేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. కళ్లే ఎదుటే తల్లి మృతి చెందడంతో దేవేందర్ బోరున విలపించడం స్థానికులను కంటతడి పెట్టించింది. పండుగ సంబురాలు ముగించుకొని క్షేమంగా ఇళ్లు చేరాల్సిన వనిత కానరాని తీరాలకు చేరడంతో భర్త బాలేశ్, కుటుంబీకులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు..

సిద్దిపేటకమాన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. లింగారెడ్డిపల్లికి చెందిన తాళ్ల మల్లారెడ్డి (65) గురువారం ఉదయం వ్యవసాయ బావి దగ్గరకు వెళ్లి తిరిగి ఇంటికొస్తున్నాడు. రాజీవ్ రహదారి తమిళనాడు హోటల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ రోడ్డు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన మల్లారెడ్డిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తమ్ముడు యాదిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కుకునూరుపల్లి గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణానికి చెందిన కార్వ రాజేశ్ (42) వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. 16న కారులో హైదరాబాద్ నుంచి బెల్లంపల్లికి వచ్చాడు. తిరిగి వెళ్తూ కుకునూరుపల్లి గ్రామ శివారులో కారును అతివేగంగా నడిపి రాజీవ్ రహదారి పక్కన ఉన్న ఐరన్ రాడ్‌ను ఢీకొట్టాడు. అనంతరం రోడ్డు పక్కన పార్కు చేసిన మరో కారును ఢీకొట్టి రోడ్డు కింద బోల్తాపడింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని పోలీసులు కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వెల్దుర్తి(తూప్రాన్): తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని బస్వాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బొడ్డు అంజయ్య, యాదమ్మ దంపతులు మూడు రోజుల కిందట ఇంటికి తాళం వేసి జిన్నారం మండలం కిష్టాయిపల్లిలోని కూతురు విజయ వద్దకు వెళ్లారు. అస్వస్థతకు గురైన అల్లుడు వెంకటేశంను పరామర్శించి గురువారం ఉదయం తిరిగొచ్చారు. ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి బీరువా ధ్వంసం చేసి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. చోరీలో తులం బంగారు ఆభరణాలు, సుమారు రూ.40వేలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

భవనంపై నుంచి పడి బాలుడికి తీవ్రగాయాలు

పటాన్‌చెరు టౌన్: భవనంపై పడటంతో బాలుడికి తీవ్రగాయాలైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తెల్లాపూర్ మున్సిపల్ పరిధి ముత్తంగి గ్రామంలో ఉంటున్న హోంగార్డు రాజు కుమారుడు లోకేశ్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బాలుడు తనతోపాటు చదివే బాలికతో గురువారం ఆమె ఇంటిపై మాట్లాడుతున్నాడు. ఇదే సమయంలో బట్టలు ఆరేసేందుకు భవనం పైకి వేరే మహిళ రావడంతో పక్కకు జరగబోయిన లోకేశ్ కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం బీరంగూడలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. యువతి కుటుంబ సభ్యులు తన కుమారుడిని హత్యాయత్నం చేయబోయారంటూ ఆరోపిస్తూ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. పేట సీఐ మహేష్ గౌడ్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన సర్దార్ అనే వ్యక్తి ఆటోలో 9 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తీసుకొస్తున్నాడు. సమాచారం అందుకున్న అధికారులు మండల పరిధిలోని ఎంఆర్ఎఫ్ పరిశ్రమ వద్ద గురువారం పట్టుకున్నారు. ఆటోను సీజ్ చేసి బియ్యాన్ని సీఎస్‌డీటీకి అప్పగించి, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థుల్లో పెరుగుతున్న మానసిక ఒత్తిడి

- నివారించేందుకు స్టూడెంట్ కౌన్సిలర్ల నియామకం
- డీఐఈఓ రవీందర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఐఈఓ రవీందర్‌రెడ్డి

సిద్దిపేటఎడ్యుకేషన్: కార్పొరేట్ విద్యా విధానంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట లయన్స్‌క్లబ్, జిల్లా ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో 'మానసిక ఆరోగ్యం' అనే అంశంపై జిల్లాలోని జూనియర్ కళాశాలల స్టూడెంట్ కౌన్సిలర్స్‌కు గురువారం ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని నివారించేందుకు ఇంటర్ బోర్డు చర్యలు చేపట్టిందని, టెలీమానస్ కార్యక్రమంతోపాటు స్టూడెంట్ కౌన్సిలర్ల నియామకం అందులో భాగమన్నారు. కౌన్సిలర్లు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థుల ఆత్మహత్యలు లేని జిల్లాగా సిద్దిపేటను నిలపాలన్నారు. వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, మానసిక వైద్యురాలు పావన సంధ్య, ప్రముఖ మానసిక నిపుణులు డాక్టర్ మామిడాల శ్రీనివాస్‌లు ఇంటర్ విద్యార్థుల్లో పలు రకాల మానసిక రుగ్మతలు, ఒత్తిడిలు వాటిని అధిగమించేందుకు కౌన్సిలర్లు చేయాల్సిన అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంటర్ విద్యాధికారి శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హరిబాబు, సెక్రటరీ మహేందర్, కోశాధికారి రాజు, జోన్ చైర్మన్ సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఉండొద్దు

మంత్రి దామోదర రాజనర్సింహా

సంగారెడ్డి జోన్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ వల్లూరు క్రాంతితోపాటు అధికారులతో ధాన్యం కొనుగోలు, రుణమాఫీ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీలో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో రూ.849 కోట్లు 9,8245 మంది రైతుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. పంట సాగుతోపాటు పంట మార్పిడిపై అవగాహన కల్పించి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వరి ధాన్యం కొనుగోలుకు జిల్లా వ్యాప్తంగా 211 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సన్నరకం ధాన్యం సాగు చేసేందుకు ప్రోత్సాహకంగా రూ.500 బోనస్ అందిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, మేనేజరు కొండల్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర, పక్కన కలెక్టర్ క్రాంతి

అనుమతులకు మించి తరగతుల నిర్వహణ

- జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ జ్యోతి

నర్సాపూర్: నర్సాపూర్‌లోని అక్షర ప్లానెట్ ప్రైవేటు పాఠశాలను జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ జ్యోతి గురువారం తనిఖీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అధికారిణికి ఫిర్యాదులు అందజేశారు. పాఠశాలకు 7వ తరగతి వరకే ప్రభుత్వ అనుమతి ఉండగా ఎక్కువ తరగతులు నడిపిస్తున్నారని తెలిపారు. అనుమతి లేని తరగతిలో చదివే విద్యార్థులకు బోనాఫైడ్ ఎలా ఇస్తారని, తమ పిల్లల భవిష్యత్ ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. సెంట్రల్ సిలబస్ బోధిస్తామని చెప్పి రాష్ట్ర సిలబస్ చెబుతున్నారని వాపోయారు. శ్రీమాత మోడల్ స్కూల్‌గా పాఠశాల పేరు రిజిస్ట్రేషన్ ఉండగా అక్షర ప్లానెట్ స్కూల్‌గా బోర్డు పెట్టారని ఆరోపించారు. అనంతరం అధికారిణి జ్యోతి మాట్లాడుతూ.. పాఠశాలకు ప్రభుత్వం నుంచి 7 వ తరగతి వరకే అనుమతులు ఉండగా 9వ తరగతి వరకు నడుపుతున్నట్లు తాను గుర్తించానని అన్నారు. తరగతుల్లో ఏసీ వసతులు లేవని, డిజిటల్ బోర్డులు లేవని ఆమె వివరిస్తూ తన తనిఖీ నివేదికను తమ శాఖ ఉన్నతాధికారులకు అందజేస్తానని వివరించారు.

పాడుబడ్డ బావిలో హనుమాన్ విగ్రహం

రామాయంపేట(మెదక్): మండలంలోని రాయిలాపూర్ గ్రామంలో హనుమాన్ విగ్రహాన్ని కొందరు పాడుబడ్డ బావిలో పడవేయడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని సహకార సంఘం కార్యాలయానికి వెళ్లే దారిని గురువారం లెవల్ చేశారు. ఈ సందర్భంగా దారిలోని పొదలతోపాటు హనుమాన్ విగ్రహాన్ని కూడా జేసీబీతో తొలగించారు. పొదలతో సహా విగ్రహాన్ని పాడుబడ్డ బావిలో పడవేశారు. దీంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేయగా, సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో చర్చించి పరిస్థితి చక్కదిద్దారు. విగ్రహాన్ని తొలగించి పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.



హనుమాన్ విగ్రహం

ఎండు గంజాయి, హాష్ ఆయిల్ స్వాధీనం

- వేర్వేరు చోట్ల నలుగురు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ చెన్నూరు రూపేశ్

సంగారెడ్డి జోన్: అక్రమంగా తరలిస్తున్న నిషేధిత ఎండుగంజాయితోపాటు హాష్ ఆయిల్‌ను జిల్లాలో వేర్వేరు చోట్ల పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితులను పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను గురువారం ఎస్పీ చెన్నూరు రూపేశ్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం, బీదర్ జిల్లాలోని భాల్కి పరిధిలోని బసవేశ్వర్ చౌక్‌కు చెందిన మల్లగొండ గతంలో బీదర్ జైలులో ఉన్నప్పుడు ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రాహుల్ చక్రవర్తితో పరిచయం ఏర్పడింది. గంజాయి సరఫరా చేస్తే అధిక డబ్బు సంపాదించొచ్చని నమ్మించాడు. బయటకు వెళ్లాక మల్లేశ్ అనే వ్యక్తిని కలవని చెప్పాడు. అతడు చెప్పిన విధంగా జైలు నుంచి విడుదలై ఒడిస్సా, ఛత్తీస్‌ఘడ్‌ల నుంచి గంజాయి తీసుకొచ్చి డబ్బులు సంపాదిస్తున్నాడు. గురువారం కారులో ఎండుగంజాయి బస్తాలతో కర్ణాటక నుంచి నారాయణఖేడ్ వైపు నాగలగిద్ద మీదుగా వస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు మనూర్ ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో కలిసి మండల పరిధిలోని డప్పూరు చౌరస్తా వద్ద పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని 40 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రవాణాకు సహకరించిన మిగితా వారు పరారీలో ఉన్నట్లు తెలిపారు.



గంజాయి హాష్ ఆయిల్ చూపిస్తున్న ఎస్పీ రూపేశ్ తదితరులు

50 గ్రాముల హాష్ ఆయిల్

పటాన్‌చెరు పరిధిలోని బీరంగూడ ప్రాంతంలోని ముగ్గురు వ్యక్తులు నిషేధిత హాష్ ఆయిల్ (గంజాయి సంబంధిత లిక్విడ్) వినియోగిస్తూ అమ్మకాలు చేస్తున్నారని సమాచారం మేరకు గురువారం అమీన్‌పూర్ ఎస్ఐ విజయరావు సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. అఖిలేష్, ప్రేమ్, సాయి ముగ్గురూ కళాశాల రోజుల్లో నుంచి హాష్ ఆయిల్ వినియోగానికి అలవాటు పడ్డారు. వెంకటేశ్వర ఆలయ పరిసరాల్లో 11 చిన్న బాటిళ్లను అమ్మేందుకు ప్రయత్నించగా పోలీసులు పట్టుకున్నారు. నిందితులకు అమ్మిన సుబ్బారావు (అరకు వ్యాలీ), శంకర్ (లింగంపల్లి), జాయ్, బిలాల్‌లు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. సమావేశంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచి సీఐ విజయ్‌క్రిష్ణ, అమీన్‌పూర్ సీఐ నాగరాజు, నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.